
# నవ్వు మొలిచింది

కె.ఎ.ముని సురేష్ పిళ్లై



పేర్లు కథను నడిపించవు. కథలో నాలుగు ఊళ్ల గురించి, నలుగురు మనుషుల గురించీ చెబుతున్నట్లయితే వాటి, వారి మధ్య గందరగోళం ఏర్పడకుండా ఉండడానికి పేర్లు ఉపయోగపడతాయంతే! అసలు ఒక ఊరిలో ఉన్న ఒక 'వాడి' గురించి మాత్రమే చెప్పడానికి పేర్లు అప్రస్తుతం. ఈ కథంతా మా ఊరిలోనే, ఆ 'వాడి' చుట్టూనే జరుగుతుంది. చివర్లో ఈ కథ కంచికి కాకుండా, పరలోకానికి వెళ్తుంది. ఆ సంగతి అప్పుడు చూద్దాం. ఇప్పుడు అప్రస్తుతం.

ముందు ఊరి గురించి. మా ఊర్లో (అంటే ఊరిచివర) ఏటిగట్టున ఉండే రావిచెట్టుకి ఓరోజు పొద్దున్నే 'వెంకటేసులు' మొలిచాడు. వెంకటేసులంటే వాడు కాదు. దేవుడు. ఏడుకొండల మీద ఉండేటోడు. ప్రతి రోజూ ప్రజలందరికీ దర్శనాలిచ్చే చాకిరీ నుంచి అర్ధ రాత్రి ఓ పది నిమిషాలు విరామం ఇస్తారు కదా.. ఆవేళలో వ్యాహ్యాళికి వచ్చినట్లున్నాడు. బహుశా ఈ రావి చెట్టు కిందే సేద తీరినట్లున్నాడు. తూగొచ్చిందో, లేదా అదొచ్చేలోగానే 'కౌసల్యా సుప్రజా రా...' అంటూ పిలుపొచ్చిందో హడావుడిలో తిరిగెళ్లిపోయినట్లున్నాడు. ఆ తొందరలో.. పిలిచిన వెంటనే వెళ్లకపోతే రేపటినుంచీ దర్శనాలు ఇచ్చే ఉద్యోగం ఉండదని జడుపో... తలకు మించిన కిరీటంలా నిద్రలేకుండా చేస్తున్నాయని వెరపో... మొత్తానికి వెళ్లే హడావిడిలో మూడు నామాలూ, శంకుచక్రాలని ఇక్కడే (అంటే రావిచెట్టు మొదట్లో) వదిలేసిపోయాడు. తెల్లవారితే-ఎవరైనా చూస్తే - తమ బతుకు తలో ముక్కా, తలో దిక్కూ అయిపోతుందని భయపడి అవి ఆ రావిచెట్టె క్కేశాయి. అలా ఓ రోజు తెల్లవారేసరికి ఆ రావిచెట్టుకి 'వెంకటేసులు మొలిచాడు'.




మామూలుగా పల్లెల్లో (ఇప్పుడు నగరాల్లోనూ తేడాలేదు) ఇంటి పెద్దదేవుళ్లు పుట్టరు. గంగమ్మలు, ముత్యాలమ్మలు, మైసమ్మలు.. ఇంతే! ఎవురో ఆ మహా తల్లికి పూని అక్కడున్న ఏదో ఒక రాయిలో తాను పుట్టిన సంగతి వాళ్లే చెప్పేసుకుంటారు. ఇక్కడ వెంకటేసులు సంగతి అలా జరగలేదు. ఎలా వ్యాప్తిచెందిందో అప్రస్తుతం.

ఆ చెట్టు మొదట్లో మొలిచిన గుర్తులు 'నామాలు, శంకుచక్రాల మాదిరిగానే ఉన్నా'యని అన్నారు భక్తులు. 'సాక్షాత్తూ వెంకటేసులు అవతారమే'నన్నారు అతిభక్తులు. 'ఏ సంగతీ తేలితే మొక్కొచ్చు' అన్నారు మితభక్తులు. అంతా కాకమ్మ కబుర్లేనన్నారు అభక్తులు. పైగా, కూలిపోయిన పంచాయతీ ఆఫీసులో నిత్యం జూదమాడుతూ, పోరంబోకుగా తిరుగుతూ వుండే ఓ ఎదవ చెట్టు మొదట్లో ఆ గుర్తులు చెక్కి, గడ్డం పెంచి పూజారి వేషమేసి డబ్బు దండుకోవడానికి కుట్ర పన్నాడని ఆ అభక్త బృందం వాదించింది. అది కాస్త తీవ్రంగా ఉండేసరికి, అవతలి పక్షం కూడా గట్టిగానే గుర్రుమంది. నాలుగు రోజులయ్యాయి. ఈలోగా గొడవ ముదిరింది.

సరిగ్గా ఆ సమయంలో 'వాడు' కథలోకి ప్రవేశించాడు. తెల్లవారేలోగా గొడవ కుదిరింది.

పొద్దున్నే ఆ వెంకటేసులికి నాలుగు సాంబ్రాణి కడ్డీలు వెలిగించి, చుట్టుపక్కలోళ్లందరినీ పిలిచి పసుపు కుంకాలు, పప్పుబెల్లాలూ, కొబ్బరిముక్కలూ వయో లింగ భేదాలనుసరించి ఎవరికేవి తగునో అవి పంచిపెట్టాడు. ఆ ముందురోజు రాత్రి వెంకటేసులు తన కలలో కనిపించి 'ఒరేయ్, నేను మీ ఊరొచ్చి నాలుగు దినాలైతే, నైవేద్యమయినా పెట్టవా..' అంటూ రావి చెట్టు మీది గుర్తులు చెప్పి వెళ్లినట్లుగా వాడు అందరికీ చెప్పాడు. అభక్తులు తోక జాడించడం మానేసి పట్టించుకోకుండా ఉండిపోయారు. అతి, మిత, భక్తులందరూ ఒకేమాట మీదకొచ్చేశారు. అలా వెంకటేసులుకు నిత్యపూజలు మొదలయ్యాయి.

వాడి మాటకు అంత విలువుంది మరి!!

***

ఎందుకంటే ఆ చిన్న పల్లెలో వాడు అందరికీ కావాల్సినవాడు. వాడికి ఓ అంగడి వుంది. యాపారం చేస్తుంటాడు. కాలక్రమంలో కొత్తతరం యాపారాలు పల్లెల్లోకి కూడా చొరబడ్డాక 'వాడు' కూడా నీళ్ల సంచులు అమ్మడం మొదలెట్టాడు. కొంచెం నోరుగల్ల మనిషి ఒక్క గుక్కలో మింగేసేంత బుల్లి నీళ్ల సంచీకి ముప్పై అయిదు పైసలు వంతున పెట్టి టోకుగా కొంటే, దాని మీదున్న ధరకే రూపాయి లెక్కన అమ్ముకోవచ్చు. మంచి ఎండలున్నప్పుడో, మనిషి మంచి దాహం మీదున్నప్పుడో రెండు రూపాయలకు కూడా అంటగట్టొచ్చు. రెట్టింపుకంటే జాస్తిగా లాభమిచ్చే ఈ యాపారం వాడికి అన్నిటికంటే బాగా నచ్చింది. అచ్చొచ్చింది. పొరపాట్న కూడా ఎవ్వరికీ గుక్కెడు దాహమైనా ఉచితంగా పోయనని వాడు ప్రతిన కూడా చేశాడు. ఇంటికి బంధువులొచ్చినా గ్లాసుడు నీళ్లివ్వకుండా, ఓ బుల్లి సంచీడు ఇచ్చి 'నీకోసం ఓ రూపాయి పోతే ఏమైందిలే బావా' అంటూ తన త్యాగాన్ని అప్రస్తుతంగా, అసందర్భంగా ప్రస్తావించేవాడు. గొంతు పిడచకట్టుకు ఎవరైనా చస్తున్నా సరే, చెమట చేతిని కూడా విదిలించకూడదనే కచ్చితమైన నిష్టగల జీవితం అలవాటు చేసుకున్నాడు.

వాడు నిరంతర ఆధ్యాత్మిక చింతన గలవాడు. సోమవారం శివుడ్నీ, మంగళవారం ఆంజనేయుల్నీ, (బుధవారం ఎవరో తెలీదు), గురువారం సాయిబాబానీ, శుక్రవారం లక్ష్మీదేవినీ, శనివారం వెంకటేసుల్నీ, ఆదివారం ఆది వారమని వినాయకుడ్నీ తన అంగడికి పిలుస్తాడు. అంగడికి తొలుత వచ్చిన పదిమందికీ చెనగులో, బెల్లమో, చక్కెరో ప్రసాదంలా పెడతాడు. అలాంటి వాడికి వెంకటేసులు కల్లోకి వచ్చాడంటే ఎవురు మాత్రం ఎందుకు నమ్మరు? రావిచెట్టుకు పూజలు మొదలయ్యాయి.

కొన్నాళ్లలోనే పూజలు ముదిరాయి. వెంకటేసులికి ఇక్కడ కూడా తీరికలేని పరిస్థితి వచ్చేసింది. ఈలోగా 'వాడు' ఆ చెట్టు పక్కనే ఓ చిన్న అంగడి కూడా తెరిచాడు. దేవుడికి పేరొస్తే నాకు లాభమొచ్చినట్టేనంటూ ... 'వాడు' ఆ అంగడిలో కొబ్బరికాయల్ని, పూజ సామాన్లనీ పావలా తక్కువకే ఇచ్చేవాడు. వాడు ఊళ్లో ఉన్న అంగడిలో ఎంత దొబ్బుతున్నడనేది తలకెక్కించుకోకుండా - భక్తులంతా 'ఆహా! ఎంతటి వితరణ శీలి' అని గ్రాంధికంలో పొగుడుకుంటూ 'వాడి' అంగడిలోనే కొంటుండేవారు. అలా వాడి కల మీద ఎవరికీ అనుమానం మళ్లకుండానే వాడి వ్యాపారం ముదిరింది. రావిచెట్టు ఇంటిపేరు చేసుకున్న ఈ కొత్త వెంకటేసులంటే ప్రజల్లో భక్తి కూడా ముదిరింది.

అతిభక్తులు ఎటుతిరిగీ ఊరుకునే రకం కాదు. పాపం వెంకటేసులు మన ఊరికొచ్చి ఇన్నాళ్లు గడుస్తుంటే దిక్కూమొక్కూ లేనోడి మాదిరిగా అలా చెట్టు కిందే వొదిలేయడం ఎంతమాత్రం న్యాయంగా లేదని వాపోయారు. వెంకటేసులుకో గుడి కట్టించాలని తీర్మానించారు. ఇలాంటి ధర్మకార్యాలకోసమే పుట్టినట్లుగా, సదా సిద్ధంగా కూర్చుని వుండే పెద్దలతో ఓ ధర్మకర్తల మండలి కూడా ఏర్పాటైంది. విరాళాలూ అవీ పోగేయడానికి రసీదు పుస్తకాలు గట్రా అచ్చు కొట్టించారు. ఓ శుభ శనివారం తెల్లవారుజామునే ఆ పుస్తకాలు అన్నింటినీ రావిచెట్టు మొదట్లో రాతితో చెక్కినంత స్పష్టంగా (!) అవతరించిన నామాలు, శంకు చక్రాల ఎదుట ఉంచి 'ఊరిమీదకు వెళుతున్నాం సామీ, నీ గుడిపేరు చెప్పి దండిగా దండుకు వచ్చేలా అనుగ్రహించు' అని గట్టిగా మొక్కి, కుంకుమ, కొంచెం అతిశయంగా కనిపించడానికి గంధమూ దట్టించిన పుస్తకాలను తలో కటీ పుచ్చుకుని బయల్దేరారు.

గుడి కడితే దిగులేమీ లేదు. కానీ ఈ విరాళాల ఏర్పాటే మన 'వాడి'కి రుచించలేదు. అసలే వాడు ఘనుడు. సొమ్ముకాడ గట్టిపాకం. పైసాలో పరమాత్మ ఉన్నాడంటే ఒప్పుకుంటాడు గానీ, పైసాలో తేడా వస్తే పరమాత్మ అయినా లెక్కపెట్టడు.

అదివరలో ఓసారి అదే ఊరిలో ఉన్న మహాశివాలయానికి వెళ్లి సిఫారసుల్తో మహారాజ దర్శనం చేయించుకున్నాడు. అంతా ముగిశాక ఆశీర్వాద మండపంలో ఓ పెద్ద తివాచీ పరిచి కుటుంబ సమేతంగా కూర్చుండబెట్టి, వేద పండితులు సుదీర్ఘంగా దీవించారు. ఆ వేదఘోషకు మనవాడు మురిసిపోయాడు. చివర్లో శాంతిమంత్రం పఠించి, కొంత విరామం ఇచ్చారు. స్పందన కనిపించక మళ్లీ, మళ్లీ ఆ శాంతి మంత్రాన్నే పదేపదే వల్లెవేస్తున్నట్టుగా చదువుతోంటే కొంతసేపటికి మన 'వాడి'కి తలకు తట్టింది - చిల్లర కోసమే వాళ్లు ముగించట్లేదని. జేబులో చెయ్యిపెట్టి, దనియాల మాదిరిగా దూసి, ఓ పావలా బిళ్ల వాళ్ల చేతిలో పెట్టి వచ్చాడు. మరి చరిత్రలో అలాంటి అనుభవాలు అనేకం ఉన్నప్పుడు గుడి విరాళాల పేచీ వచ్చె.

'గుడి అంటే మాటలా. పైగా, మంచో చెడో దాని వల్ల నేరుగా యాపారం ఉన్నది నీకొక్కడికే. కనీసం

యాభై వేలన్నా ఇవ్వాలి నువ్వు' అన్నారు పుస్తకాలు పట్టుకున్నోళ్లు. 'ఎందుకూ ఇనప్పెట్టె తాళాలిస్తా... తోచినంత దొబ్బుకుపోండి' అని మనవాడు కసిగా అంతరంగంలో అనుకున్నాడు. ఆంతరంగికులతోనూ అన్నాడు.

అసలే మనవాడికీ, డబ్బుకీ లంకె. యాపారం పెంచడానికి అంగడిని కొంచెం పెద్దది చేయాలంటే ఒకేసారి పెట్టుబడి పేరిట ఓ యాభైవేలూ, లక్షయినా తగలేస్తాడు గానీ, సరుకులు పొట్లాలు కట్టే పనివాడికి నెలకు ఓ యాభై జీతం పెంచాలంటే గింజుకుపోతాడు. అడపాదడపా రాత్రింబవళ్లు పనిచేయాల్సి వస్తే ఓ పదో పరకో కానుక అని విదిలిస్తాడు తప్ప, ప్రాణం మీదికి వచ్చినా ఆస్పత్రి అవసరాలకు ఇదుంచమని అరగానీ అయినా అందించడు. కావలిస్తే అప్పుగా లెక్క రాసుకుని, నెలబత్తెంలో కత్తెర వేస్తుంటాడు. అలాంటివాడు, దేవుడికే కావచ్చుగాక, విరాళం కావాలంటే అప్పనంగా యాభై వేలిస్తాడా?

అయితే మనవాడికి ఓ భృత్యుడు ఉన్నాడు. నిత్య గుండుతో అపర భక్తశిఖామణిగా అవతరించినవాడు. రాతిలోనూ నాతిలోనూ రాత్రీ పగలూ తేడాలేకుండా పరమాత్ముడినే కనగలిగినవాడు. నిత్యమూ నీ శుభం కోసమే దేవుడిని వేడుకున్నానని మనవాడిని నమ్మించగలిగినవాడు. మన వాడికి కడు కావల్సినవాడు. ఓ ఉదయం పూట ప్రసాదం పుచ్చుకుని జవాబుగా ఓ సలహా పారేశాడు.


'చూడూ! నీ కల నిజమో కాదో నేనెరగను. ఊరెరగదు. అయినా ఆ చెట్టు మొదట్లో ఉన్న రాతి గీతలు ఏడుకొండల వెంకటేసులే అని ఊరు నమ్మింది. చూస్తున్నావుగా... రోజుకో వందమంది పోగవుతున్నారు. అక్కడి నీ అంగడి యాపారమూ పెరిగింది. అవునా, కాదా!? మరి ఏ మహత్యా లేకుండానే... అంత ప్రభ ఎలా వెలుగుతున్నట్టు? ఏ పుట్టలో ఏ పాముందో తెలియనట్టే ఏ చెట్టులో ఏ దేముడున్నాడో ఎవరికెరుక! మొత్తానికి అందులో ఏదో ఉందన్నది నిజం. దేవుడితో పెట్టుకోవడం ఎందుకు? కావలిస్తే నీకో చిట్కా చెబుతా' అన్నాడు. ఆ చిట్కా ఏమిటో గాయత్రి మాదిరిగా చెవిలోనే ఉపదేశించాడు. వినగానే మనవాడి మొహంలో మతాబులు వెలిగాయి. ఆనందం పల్లవించింది.

'వెంకటేసులు మన ఊరొచ్చాడు గదా. తలా కొంచెం పుణ్యం అమ్ముతాం బాబూ.. ధారాళంగా సమర్పించుకోండి' అంటూ పుస్తకాలు పుచ్చుకుని ఊరి మీద పడి దండుతున్న అతిభక్తుల్ని కేకేసి పిలిపించాడు. మళ్లీ కల అంటే అతిగా ఉంటుందని, తన మదిలో మెదిలిందంటూ మర్మం చెప్పాడు. 'వెంకటేసులు మీద నా భక్తి ఈనాటిది గాదు. ఏపాటిదో మీకె రుకే! అయితే యాభయివేలో, లచ్చో అంటూ భగవంతునికీ భక్తునికీ మధ్య అదేదో అగరొత్తుల్లాగా... ధర పెట్టడం పాడిగాదు. నే చిన్నవాణ్ణి. అలా అని తప్పించుకోను. మీకొచ్చిన సొమ్ముతో గుడికట్టండి, స్వామి నిత్యపూజలకు అక్కడ ఓ బోరు వేయిస్తా... ఎంతైనా సరే...! అయితే నాకో మాట ఇవ్వాలి. ఆ బోరు నీటిని కేవలం స్వామి నిత్యపూజలకు, చెట్టును కడగడానికి మాత్రమే వాడాలి. భక్తులకు తీర్థంలా ఇస్తే పర్లేదు గానీ, ఓ చలివేంద్రం పెట్టి దాహం తీర్చేయకూడదు. నే బతుకుతోందే నీళ్ల యాపారం మీద. మరి దేవుడు మొలిచాడు కదాని ఈ బోరు నా నోరు కొట్టకూడదు. నా ఆ బోరు పలుచన కాకూడదు. నా యాపారం నాదే. దేవుడికోసం మటుకు ఈ బోరు. ఏమంటారు?' చెప్పాడు.

ఆ ధర్మకర్తలకు ఇందులో నిగూఢమేమీ కనిపించలేదు. ఎవరోవొకరు బోరు వేయించాల్సిందే కదా... పోన్లెమ్మని అనుకున్నారు. బేరం కుదిరింది. మనవాడు బోరు వేయించాడు. వెంకటేసులు మొలిచిన రావి చెట్టు ఏటిగట్టున ఉందని ముందే అనుకున్నాం. ఆ ఏరు ఎండినదే అయినా, చేత్తో తవ్వితే చెలమలు తగుల్తాయి. గట్టున బోరు బరువెంతవుతుంది. మనవాడు పాతికకు లెక్క చెప్తాడు కానీ, పదివేలు కూడా కాలేదని ప్రజలు అనుకుంటారు. గుడి పూర్తయింది. బోరూ వచ్చింది. అదే గుడికాడ వాడి నీళ్ల యాపారమూ పెరిగింది. కొన్నేళ్లు గడిచాయి. సరాసరి స్వర్గానికే వెళ్లవచ్చునని పురాణాలూ గట్రా గట్టి హామీ ఇస్తున్నాయి గనుక మనవాడు గొంతులోంచి తులసి తీర్థం దిగుతున్న తుది క్షణంలోనూ 'వెంకటేసులా' అని పలుకుతూనే...

***

పరలోకం.




ఇది నరకం అని ఖరారుగా చెప్పలేను.

యమధర్మరాజు కొలువైన కార్యాలయం నరకం కాదనే నా అనుమానాలు నాకున్నాయి. ముందుగా ఆయన కార్యాలయానికి వెళితే, ఆయన విచారించి శిక్ష వేస్తే చేరుకునేది నరకమనీ, సుఖపడమని తెలిస్తే అందుకునేది స్వర్గమనీ నా నమ్మిక. కనుక, ఇది పరలోకంలో యమధర్మరాజు కొలువు.

మన 'వాడు' ఠీవిగానే వచ్చాడు. 'పొరపడితివో... త్వరపడితివో...' అంటూ సినిమా పాట పల్లవించి, 'నన్ను ఇక్కడికెందుకు తెప్పించావ్ యమా' అంటూ నందమూరి తారకరామారావు తరహాలో నిలదీశాడు. ఇదంతా యముడు పట్టించుకోలేదు. సత్యనారాయణ మాదిరిగా వాదన పెట్టుకోలేదు. 'వీడిని తీసుకెళ్లి నాలుక పిడచకట్టుకుపోయి, గిడసబారిపోయినా సరే గుక్కెడు నీళ్లివ్వకుండా అలమటించేలా శిక్షించండి' అని తీర్పు చెప్పేశాడు.

మనవాడికి సర్రున కోపం వచ్చింది. 'ఆగు' అని గద్దించాడు. 'అసలు ఏడుకొండల వెంకటేసులు మా ఊరొచ్చి రావిచెట్టులో ఉన్న సంగతి నీకు తెలుసా?' అని ప్రశ్నించాడు. 'రావిచెట్టు ఒకటేమిటి, రాయీ రప్పా, మట్టీ ఇసుకా అన్నిటిలోనూ ఉన్నాడు' చెప్పాడు యముడు.

'అదంతా కట్టిపెట్టు. రావిచెట్టులో వున్న వెంకటేసులుకి రోజూ స్నానానికి, అన్నానికి, దాహానికి నేను వేసిన బోరు నీళ్లే వాడారు తెలుసా? సరాసరి దేవుడు దాహం తీర్చే బోరు ధర్మం చేసిన నాకు మిగిలిన అందరికంటె అధికపుణ్యం రావాలి. నీ చిత్రగుప్తుడి లెక్కలు తప్పి వుంటాయి. కావలిస్తే అతణ్ణి మన్నిస్తాను. నిన్ను మాత్రం కాదు. నాకు దాహంతో అలమటించే శిక్షా... ఖబడ్దార్. తప్పుడు తీర్పులు ఇస్తున్నందుకు నీ ఉద్యోగం పీకించేయగలన్ను - వెంకటేసులుతో చెప్పి' బెదిరించాడు మనవాడు.

యముడు తనదైన శైలిలో పగలబడి నవ్వాడు. చిత్రగుప్తుడు అల్లు రామలింగయ్య మాదిరిగానే అర నవ్వు నవ్వాడు. యముడు అందుకున్నాడు. 'ఒరేయ్ ఇచ్చివాడా! బోరు వేయించితివి సరే, పుణ్యం ఆ చెట్టును కడిగిన వాడికి వస్తుంది. ఆ నీళ్లు నీ అబ్బ సొత్తు అనుకున్నావా? నీళ్లను నువ్వు పుట్టించావా? నువ్వు తయారుచేశావా? నీళ్లు అమ్ముకునే నువ్వు దాహానికి అలమటించేవాడికి గుక్కెడయినా పోయకపోతివి. అలా నిలువునా సగం చచ్చిన వారి ప్రాణాలు నేలలో ఇంకితే బోరులో నీళ్లు తయారయ్యాయి. అధిక పుణ్యం వస్తే గిస్తే వారందరికీ పంచుతా. నువ్వు పద' అన్నాడు.

మనవాడు నివ్వెరపోయాడు. మోసపోయాను అనుకున్నాడు. ముందు ఈ బోడి సలహా చెప్పిన బోడి గుండు భృత్యుడి మీద అనుమానం వచ్చింది. ఆనక ఇన్నాళ్లూ తన బోరు నీళ్లు తాగి, వాటితో స్నానం చేసిన రావిచెట్టు వెంకటేసులు కృతఘ్నత మీద కోపం హెచ్చింది. అప్పుడే నాలుక పిడచకట్టుకుపోతున్నట్లు అనిపించింది. అంతలోగా ఓ యమభటుడు మెడపై చెయ్యేసి, నరకం వైపు నడిపించాడు.

***

ఏడుకొండల వెంకటేసులు ముఖ కవళికలేమిటో ఎవరైనా ఎపుడైనా చూశారా? పాపం ఆయన నవ్వాడో, విచారంగా వున్నాడో, ముభావంగా, అభావంగా ఎలా అనిపిస్తున్నాడో... అంత భారీ అలంకరణలో ఎవరికి మటుకు ఎలా తెలుస్తుంది? ఏకరీతిగా పొలోమని మొక్కేయడమే తప్ప దేవుడి మనసెరిగి మొక్కడానికి ముఖకవళికలు తెలియవాయె.

ఆ మూల విరాట్టు సంగతి ఎలా పోయినా, మా ఊరి ఏటిగట్టు రావిచెట్టు మొదట్లో మొలిచిన శంకుచక్రాలు, నామాల కింద కొత్తగా ఓ నవ్వు మొలిచింది.